సాక్షి విజయనగరం

బుధవారం । 2 । ఆగస్టు । 2023



సహకారానికి గుర్తింపు

సహకార సంఘాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. సేవలతో గుర్తింపు పొందుతున్నాయి.

- 8లో



వీడిన హత్య కేసు మిస్టరీ

ఎస్.కోట పట్టణంలోని ఓ లాడ్జిలో మహిళ హత్యకేసు మిస్టరీ వీడింది. నిందితుడు జనసేన నాయకుడిగా గుర్తించారు.

- 8లో

5న రాజాం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

విజయనగరం అర్బన్: రాజాం నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాల అమలుపై ఈ నెల 5న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం జరుగుతుందని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అధికారులు, పాలకులు హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

ఉత్తమ వీఏఏగా సంగమేష్



గుర్ల: వ్యవసాయ విభాగంలో రైతులందరికీ అందుబాటులో ఉంటూ సాగు సేవలు అందిస్తున్న గుర్ల మండలం పాలవలస గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ బి.సంగమేష్ జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ వ్యవసాయ అధికారిగా ఎంపికయ్యారు. ఆయనను ఏఓ ఎం.తిరుపతిరావు, వ్యవసాయ సిబ్బంది మంగళవారం అభినందించారు.

కుంకుమ పూజలు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

రాజాం సిటీ: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళా భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు జరిపారు. అధిక శ్రావణమాసం, పౌర్ణమి సందర్భంగా వాసవీక్లబ్ మన రాజాం-సారథి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలోని లక్ష్మీనారాయణస్వామి సన్నిధిలో విష్ణుసహస్రనామ పారాయణం చేశారు.

వీఆర్‌ఎస్ ప్రాజెక్టు నీరు విడుదల రేపు

మక్కువ: వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో ఖరీఫ్ వరి సాగుకు ఈనెల 3న సాగు నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ డీఈ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై వీఆర్‌ఎస్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు సాగునీరు విడుదల చేస్తారన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో సుమారు 159 మీటర్ల నీరు నిల్వ ఉందని తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుకు శ్రీకారం

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



విజయనగరం మండలంలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటల నమోదు (ఈ- క్రాప్)కు శ్రీకారం చుట్టామని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు వారి లాగిన్‌లో సాధారణ విస్తీర్ణం, సిబ్బంది ప్రొఫెయిల్ అప్డేట్ చేసిన తర్వాత ఆర్‌బీకేలను సచివాలయాలకు మ్యాపింగ్ చేస్తామని చెప్పారు. రెవెన్యూ గ్రామాలవారీగా సర్వేనంబర్లను వెబ్‌ల్యాండ్ నుంచి డౌన్‌లోడ్ చేసి ఆర్‌బీకే ఇన్‌చార్జిలకు కేటాయిస్తామని తెలిపారు. ఆయా సర్వేనంబర్లలో సాగుచేసిన పంటల ఆధారంగా ఈ క్రాప్ నమోదు జరుగుతుందన్నారు. విపత్తుల సమయంలో రైతులకు పరిహారం అందాలంటే ఈ క్రాప్ నమోదు తప్పనిసరని పేర్కొన్నారు. వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకులు పంట పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పంటల వివరాలు నమోదు చేస్తారని తెలిపారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

విజయనగరం అర్బన్: డిపార్ట్‌మెంటల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అభ్యర్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ పి.డిల్లీశ్వరరావు పరీక్షల నిర్వహణ విధివిధానాలను వివరించారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు 6 రోజుల పాటు, స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఆబ్జెక్టివ్ పరీక్ష ఉంటుందని, ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు డిస్క్రిప్టివ్ పరీక్ష ఉంటుందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఆబ్జెక్టివ్ పరీక్ష రాసేందుకు అదనంగా 40 నిమిషాలు, డిస్క్రిప్టివ్ పరీక్షకు 50 నిమిషాలు ఇవ్వాలని, స్క్రైబ్‌లను కూడా అనుమతించాలన్నారు.

జగనన్న సురక్ష సక్సెస్

- ప్రతి కుటుంబానికీ పలకరింపు
- అవసరమైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు
- 19 ప్రభుత్వ శాఖల పరిధిలో పూర్తిగా ఉచితం
- నెల రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహణ
- విజయవంతంగా ముగింపుపై ప్రజల్లో హర్షం

జగనన్న సురక్ష సేవలిలా...

అంశం	విజయనగరం	పార్వతీపురం మన్యం
గ్రామీణ/అర్బన్ మండలాలు	31	18
గ్రామ/వార్డు సచివాలయాలు	626	350
క్లస్టర్లు	10,777	5,665
సర్వే జరిగిన క్లస్టర్లు	10,599	5,516
మొత్తం నివాస గృహాలు	6,27,168	2,95,909
సర్వే జరిగిన గృహాలు	5,16,394	2,39,718
వినతులకు ఇచ్చిన టోకెన్లు	4,89,714	1,33,684
అందించిన సేవలు	4,74,419	1,27,493
పెండింగ్‌లో సేవలు	15,295	6,191
పరిష్కార శాతం	96.88	95.37

ప్రధానమైన సేవలిలా...

సేవలు	లబ్ధిదారులు
సమగ్ర కులధ్రువీకరణ పత్రం	2,17,768
ఆదాయ ధ్రువీకరణపత్రం	2,10,437
ఆధార్ కార్డు మార్పులు చేర్పులు	19,628
కులధ్రువీకరణ పత్రం సవరణ	7,414
ఆధాయ ధ్రువీకరణపత్రం మార్పు	4,958
ఆర్‌ఓఆర్ 1బీ సర్టిఫికెట్	3,980
కంప్యూటరైజ్డ్ అడంగల్ సర్టిఫికెట్	2,431
రేషన్‌కార్డులో చేర్పులు	1,939
ఓబీసీ సర్టిఫికెట్	1,242
కుటుంబసభ్యుల ధ్రువీకరణపత్రం(ఎఫ్‌ఎంసీ)	879
నమోదు ఆలస్యమైన మరణ/జనన ధ్రువీకరణపత్రం	751
రేషన్‌కార్డు విభజన	631
వివాహమైనవారికి కుటుంబ విభజన	553
మ్యుటేషన్ టైటిల్ డీడ్ పీపీబీ	453
కొత్త రేషన్‌కార్డు జారీ	440
కౌలురైతు హక్కుపత్రం	166
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు అప్‌డేట్	162
వివాహ ధ్రువీకరణపత్రం	113



జగనన్న సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెల రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. ప్రతి కుటుంబాన్నీ ప్రజాప్రతినిధులు, అధికారులు పలకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. వారి అవసరమైన ప్రభుత్వ సేవలేమిటో తెలుసుకొని అందుకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. 19 ప్రభుత్వ శాఖల పరిధిలో సేవలను నిర్దేశించిన రుసుములేవీ చెల్లించనవసరం లేకుండానే పూర్తి ఉచితంగా అందించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారు.

జూన్ 23న ప్రారంభం..

ప్రజల సమస్యలకు నాణ్యమైన పరిష్కారాన్ని సత్వరమే అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం గత జూన్ 23వ తేదీన లాంఛనంగా ప్రారంభించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జూలై 1వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ఆరంభమైంది. నాటి నుంచి రోజు విడిచి రోజు నెల రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ వివిధ దశల్లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలు సత్ఫలితాలను ఇచ్చాయి.

> **ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం**
>
> జిల్లాలో నెలరోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల ద్వారా ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమం అనుకున్న దానికన్నా విజయవంతమైంది. ప్రజల మన్ననలు పొందింది. ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాల సరసన విజయనగరం జిల్లా నిలవడం హర్షణీయం.
>
> – నాగలక్ష్మి, విజయనగరం జిల్లా కలెక్టర్

ప్రణాళిక ప్రకారం...

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతి మండలంలో ఎంపీడీఓ, తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలుగా అధికారులు, సిబ్బంది పనిచేశారు. విజయనగరం నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ అధికారులు అదే వ్యూహంతో ముందుకు సాగారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

ప్రతికుటుంబానికీ ప్రయోజనం...

విజయనగరం జిల్లాలో 626, పార్వతీపురం మన్యం జిల్లాలో 350 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో నివాస గృహాలను ఒక ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సందర్శించారు. ప్రత్యేక సర్వే నిర్వహించారు. 19 ప్రభుత్వ శాఖల పరిధిలో వివిధ సేవలకు సంబంధించిన వినతులను ప్రజల నుంచి సేకరించారు. వాటికి సంబంధించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి వారికి టోకెన్లు ఇచ్చారు. ఆయా వినతులను పరిశీలించిన తర్వాత అర్హులైన వారికి పూర్తి ఉచితంగా సేవలను మంజూరు చేశారు. వివిధ సర్టిపికెట్లను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రజలకు అందించారు.

మిషన్ మోడ్‌లో సేవలు...

రెవెన్యూ, పురపాలక పట్టణాభివృద్ధి, రిజిస్ట్రేషన్-స్టాంపులు, వ్యవసాయం, ఆధార్, పౌరసరఫరాలు, గ్రామ/వార్డు సచివాలయాలు, గ్రామీణాభివృద్ధి, కార్మిక, వైద్య ఆరోగ్యం, పోలీసు, విద్యుత్, దేవాదాయ, వక్ఫ్, ఫ్యాక్టరీలు, భాషా సాంస్కృతిక తదితర శాఖల పరిధిలో అందిన వినతులకు సంబంధించి విజయనగరం జిల్లాలో 96.88 శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 95.37 శాతం పరిష్కారం లభించింది. విస్తృత పరిశీలన అవసరమైన వినతులు కొన్ని మాత్రమే పెండింగ్‌లో ఉంచారు.

పైసా ఖర్చులేకుండా...

సమగ్ర కుల ధ్రువీకరణపత్రం, ఓబీసీ, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, కౌలుదారు గుర్తింపుకార్డులు, ఆర్‌ఓఆర్ 1బి సర్టిఫికెట్, కంప్యూటరైజ్డ్ అడంగల్, మ్యుటేషన్ టైటిల్ డీడ్, పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ ముద్రించిన కాపీ జారీ, పొసెషన్ సర్టిఫికెట్, కొత్తగా వివాహమైనవారికి రేషన్‌కార్డులో విభజన, ఇంటిస్థల పట్టా జారీ, ఆధార్ లింకేజీ ఇలా పలు సేవలను ప్రభుత్వం ఉచితంగా అందించింది.



కుప్పిలి వీధిలో వృద్ధురాలు బంగారమ్మకు పింఛన్ అందజేస్తున్న సీహెచ్ లావణ్య



బుచ్చన్నకోనేరు ప్రాంతంలో కొండకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ యశోద

పింఛన్ల పంపిణీ అద్వితీయం



విజయనగరం కాపువీధిలో లేవలేని స్థితిలో ఉన్న రవుడు సత్యవతికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లావణ్య

విజయనగరం అర్బన్: వైఎస్సార్ పింఛన్‌కానుకల పంపిణీలో విజయనగరం జిల్లా రెండో స్థానంలో నిలిచింది. నెలలో తొలిరోజు మంగళవారం వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి 81.44 శాతం మంది పింఛన్‌దారులకు పింఛన్ డబ్బులు అందజేసినట్టు డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి తెలిపారు. జిల్లాలోని 14 రకాల పింఛన్లను 2,75,682 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా, ఒక్కరోజులోనే 2,24,507 మందికి పంపిణీ చేసినట్టు వెల్లడించారు. 85 శాతం దాటి పింఛన్ల పంపిణీతో బొబ్బిలి అర్బన్, విజయనగరం, విజయనగరం అర్బన్, బొండపల్లి, నెల్లిమర్ల అర్బన్, భోగాపురం, దత్తిరాజేరు, కొత్తవలస మండలాలు ముందువరుసలో ఉన్నాయని పీడీ తెలిపారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకాల పంట



సాధించిన పతకాలను చూపిస్తున్న బెల్లాన హారిక, పల్లవి

నెల్లిమర్ల రూరల్: ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఏషియన్ యూత్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన క్రీడాకారిణి బెల్లాన హారిక మంగళవారం జరిగిన 59 కేజీల యూత్ విభాగం పోటీల్లో స్నాచ్‌లో 78 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 98 కేజీలు.. మొత్తంగా 176 కేజీల బరువును ఎత్తి బ్రాంజ్ మెడల్ దక్కించుకోగా, స్నాచ్‌లో 78 కేజీల బరువును లిఫ్ట్ చేయడంతో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అదే గ్రామానికి చెందిన మరో క్రీడాకారిణి శనపతి పల్లవి 64 కేజీల జూనియర్ విభాగంలో పోటీల్లో పాల్గొని స్నాచ్ లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కేజీల చొప్పున... మొత్తంగా 196 కేజీల బరువును లిఫ్ట్ చేసి బంగారు, వెండి పతకాలను దక్కించుకుంది. ప్రతిభ కనబర్చిన ఇద్దరికీ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు లక్ష్మి, వెంకటరామయ్య, బాబు, మూర్తి, కోచ్ చల్లా రాము అభినందనలు తెలిపారు.

గొర్రెల పెంపకం దారులకు రూ.5 కోట్ల కేటాయింపు

విజయనగరం టౌన్:



మన్యాల కృష్ణను సత్కరిస్తున్న ఇసరపు శేఖర్ యాదవ్, సమితి ప్రతినిధులు

గొర్రెల పెంపకందారుల రుణాల కోసం జిల్లాకు రూ. 5 కోట్లు కేటాయించడం హర్షణీయమని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. జిల్లా వెటర్నరీ కేంద్రంలో గొర్రెల సహకార సంఘం జిల్లా చైర్మన్ మన్యా కృష్ణ యాదవ్‌కు ప్రత్యేక చాంబర్‌ను కేటాయించినందుకు పట్టణంలో ఉన్న యాదవులు పలువురు మంగళవారం ఆయనను సత్కరించారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ తమ సహకార సంఘానికి చాంబర్ కేటాయించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గొర్రెల కాపరుల కోసం వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని 500 రెయిన్ కోట్లు, కాపర్లు మంద చేసుకోవడానికి టార్చ్ లైట్లు సబ్సిడీపై అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో యాదవ కుల పోరాట సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏమయ్యాడో.. ఏమో..!



పతివాడబర్రిపేట సముద్రతీరంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ భాస్కరరావు, మెరైన్ ఎస్‌ఐ రమేష్, తదితరులు



తీరం ఒడ్డున విషణ్ణవదనంలో పతివాడబర్రిపేట మత్స్యకార మహిళలు

- పతివాడ బర్రిపేట సముద్రతీరంలో బోటు బోల్తా
- ఒకరు గల్లంతు, ఆరుగురు సురక్షితం
- గల్లంతైన వ్యక్తికోసం గాలింపు

పూసపాటిరేగ: సంద్రంలో చేపలవేటే వారి జీవనాధారం. ప్రతిరోజు వలే గంపెడాశతో బోటుపై మంగళవారం వేకువజామున వేటకు బయలుదేరారు. ఒడ్డు నుంచి కిలోమీటరు దూరం వెళ్లారు. అంతే.. రాకాసి అలలు వారి బోటును తాకాయి. క్షణాల్లో బోటు బోల్తాకొట్టింది. సంద్రంలో హాహాకారాలు.. బోటులో వెళ్తున్న ఏడుగురిలో ఆరుగురు ఈత ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. ఒకరు గల్లంతయ్యారు. ఆయన ఆచూకీ కోసం తోటి మత్స్యకారులు తీరంలో వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఏమయ్యాడో ఏమో అంటూ ఆవేదన చెందుతున్నారు. ప్రాణాలతో రావాలంటూ ప్రార్థనలు చేస్తున్నారు. గల్లంతైన వ్యక్తికోసం కోస్టుగార్డు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

కళ్లన్నీ తీరంవైపే...

పూసపాటిరేగ మండలం పతివాడ బర్రిపేటకు చెందిన వాసుపల్లి అప్పన్న (48), ఎల్లాజీ, రామస్వామి, మైలపల్లి కొర్లయ్య, పోలయ్య, మసీను, రాయితి అప్పన్నలు మంగళవారు తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఇంజిన్‌బోటుపై సముద్రంలో చేపల వేటకు బయలుదేరారు. వేటకు బయలుదేరిన 10 నిమిషాలలో అలలదాటికి వారు వెళ్తున్న బోటు బోల్తాపడింది. వాసుపల్లి అప్పన్న మినహా మిగిలిన వారందరూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. అప్పన్న ఆచూకీ కోసం తహసీల్దార్ ఇ.భాస్కరరావు, మెరైన్ ఎస్‌ఐ పి.రమేష్‌ల సమక్షంలో తీరంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి వరకు ఆచూకీ లభించలేదు. గ్రామ మత్స్యకారులందరూ తీరానికి చేరుకుని సంద్రంవైపే ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రాణాలతో బయటపడాలని గంగమ్మ తల్లికి ప్రార్థిస్తున్నారు. గంగమ్మతల్లీ నీవే మా దిక్కు అంటూ వాసుపల్లి అప్పన్న భార్య లక్ష్మి రోదించిన తీరు అక్కడివారి హృదయాలను కలచివేసింది.

తండ్రి గల్లంతు.. కొడుకు సురక్షితం..

బోటులో చేపలవేటకు వెళ్లిన ఏడుగిరిలో వాసుపల్లి అప్పన్న, ఎల్లాజీ తండ్రీకొడుకులు. బోటు బోల్తాకొట్టిన సమయంలో అందరం ఒకవైపు పడిపోయామని, తండ్రికోసం వెతికినా ఆచూకీ కనిపించలేదంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరిన ఎల్లాజీ బోరున విలపిస్తున్నాడు. అప్పన్న కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి జనార్దనరావు పరామర్శించి ఓదార్చారు.



ప్రమాదానికి కారణమైన బోటు ఇదే

మృత్యుతీగ

- ఉపాధిహామీ వేతనదారులను బలితీసుకున్న జీఏవైర్
- పనిచేస్తుండగా విద్యుత్‌షాక్
- ఇద్దరు మృతి, మరొకరికి స్వల్పగాయాలు
- విషాదంలో పూడివలన



అప్పలనాయుడు మృతదేహం



రామమూర్తి మృతదేహంపై పడివిలపిస్తున్న భార్య, బంధువులు

బాడంగి: విద్యుత్ తీగల మీదుగా కిందకు వేలాడిన జీఏ వైరు వారి పాలిట యమపాశమైంది. పనిలో నిమగ్నమైన ఇద్దరు వేతనదారులను కాటేసింది. కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిల్చింది. బాడంగి పోలీసులు, వేతనదారులు తెలిపిన వివరాల ప్రకారం... బాడంగి మండలం పూడివలస గ్రామానికి చెందిన వేతనదారులు మంగళవారం మధ్యాహ్నం యథావిధిగా దొండ్లమాను చెరువు మదుము నుంచి పూడి సీతంనాయుడు పొలం వరకు ఫీల్డుచానల్‌లో జంగిల్ క్లియరెన్స్ పనుల్లో నిమగ్నమయ్యారు. పొదల్లో విద్యుత్ తీగెలను ఆనించి ఒక జీఏవైరు ఎప్పటినుంచో వేలాడుతోంది. దీనిని గమనించకుండా పనిలో నిమగ్నమైన పూడి అప్పలనాయుడు(65) కాలికి వెనుక నుంచి వైరు తగిలింది. అంతే.. షాక్‌కు గురై అక్కడికక్కడే తనువు చాలించాడు. అతనిని కాపాడే యత్నంలో బడేరామమూర్తి (55)కూడా షాక్‌కు గురై ప్రాణాలు విడిచాడు. మరో వేతనదారుడు వెంపడాపు రాములుకు స్వల్ప గాయాలయ్యాయి. అప్పటివరకు అందరూ కలిసి పనిచేస్తుండగా... కళ్లముందే ఇద్దరు వేతనదారులు చనిపోవడంతో హాహాకారాలు మిన్నంటాయి. ఆ ప్రాంతమంతా కన్నీసంద్రమైంది. ప్రమాదవార్త తెలుసుకున్న బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు, తెర్లాం ఎస్‌ఐ సురేంద్ర నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడు అప్పలనాయుడుకు భార్య అచ్చియ్యమ్మ, ఇద్దరు పిల్లలు ఉండగా, బడే రామమూర్తికి భార్య సత్యవతితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్దలు మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదం అలముకుంది.

ఎమ్మెల్యే సంతాపం

వేతనదారుల మృతివార్త తెలుసుకున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు బాడంగి సీహెచ్‌సీకి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఆయన వెంట ఎంపీపీ బోగి గౌరి, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మరిపి శంకరరావు, పూడిబాల, ఎస్‌ఐ జయంతి తదితరులు ఉన్నారు.



సీహెచ్‌సీలో మృతుల బంధువులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే శంబంగి

క్లుప్తంగా

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన పుష్ప

మెంటాడ: మండలంలోని పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె పుష్ప (17) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానికులు మెంటాడ ఆస్పత్రికి హుటాహుటిన తరలించగా అప్పటికే మృతిచెందినట్లు ఆస్పత్రి సిబ్బంది ధ్రువీకరించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న సీఐ లెంక అప్పలనాయుడు, గజపతినగరం ఎస్సై గంగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని యువతి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతురాలి తల్లిదండ్రులు స్థానికంగా లేకపోవడంతో స్పష్టమైన వివరాలు తెలియరాలేదని, యువతి బంధువుల నుంచి ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ, ఎస్సైలు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్త గజపతినగరం ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు చెప్పారు. ఫిర్యాదు వచ్చిన అనంతరం దర్యాప్తు చేపడతామన్నారు.

జ్వరంతో విద్యార్థి మృతి


విద్యార్థి మహేంద్ర(ఫైల్)

మక్కువ: మండలంలోని నంద గ్రామానికి చెందిన విద్యార్థి బిడ్డిక మహేంద్ర (15) జ్వరంతో మృతి చెందినట్లు తెలిసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మహేంద్ర ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలలో పదవతరగతి చదువుతున్నాడు. గత నెల 27వ తేదీన కండ్ల కలక రావడంతో వసతి గృహం నుంచి గ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ వద్ద రెండు రోజుల పాటు వైద్య సేవలు పొందాడు. మహేంద్రకు జ్వరం రావడంతో మక్కువలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యసేవలందజేసినప్పటికీ జ్వరం తీవ్రం కావడంతో మంగళవారం కన్నుమూశాడు. మహేంద్ర మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు


మాట్లాడుతున్న డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం కల్పిస్తూ తన కర్తవ్యాన్ని, బాధ్యతలను నిర్వర్తిస్తానని రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ వారిలో చైతన్యం నింపుతానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ గిరిజన ప్రజలను నాగరికత, అభివృద్ధికి మరింత చేరువ చేసేందుకు కమిషన్ తరఫున తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో విలేకరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజల దీర్ఘకాలిక సమస్యలు, హక్కులు, చట్టాల పర్యవేక్షణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మాట్లాడారు. కమిషన్ తరఫున రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తామని, వారి హక్కులు, చట్టాల అమలుపై గిరిజనుల్లో చైతన్యం నింపుతామని స్పష్టం చేశారు. ఎస్టీకుల ధ్రువీకరణ పత్రాల జారీ, డోలీ కష్టాలు, బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడం, విజయనగరం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సదుపాయాలపై విలేకరులు ప్రశ్నించగా క్షేత్రస్థాయి పర్యటనలు చేసి పరిశీలించి పూర్తిస్థాయి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

సహకారానికి గుర్తింపు

- జిల్లాలో ప్రథమస్థానం సాధించిన కెల్ల సొసైటీ
- మల్టీ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీగా రూపాంతరం
- రూ.85 వేల నుంచి రూ.22 కోట్లకు పెరిగిన టర్నోవర్


కెల్ల సొసైటీ గోదాములు


కెల్ల సొసైటీ భవనం


అప్కాబ్ అధికారులు పంపించిన ఉత్తమ సొసైటీ పత్రాన్ని చూపిస్తున్న కేవీ సూర్యనారాయణ రాజు

గుర్ల: సహకారం సంఘాలు సంప్రదాయంగా రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరా, రుణాల అందజేత మాత్రమే కాకుండా వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నాయి. అలాంటి వాటిలో కెల్ల సొసైటీ ముందువరుసలో ఉంది. ఒకప్పుడు రైతులకు మాత్రమే సేవలందించే ప్రాథమిక సహకార సంఘాలు సామాన్యులకు కూడా అవసరమైన ప్రస్తుతం సేవలు సైతం అందిస్తున్నాయి. గతంలో ఎరువులు, పురుగు మందులు అమ్మకాలకు మాత్రమే పరిమితమైనా ప్రస్తుతం బహుళ సేవా సహకార పరపతి సంఘాలుగా (మల్టీ సర్వీసెస్) మారుతున్నాయి. ఇలా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న కెల్ల సొసైటీ జిల్లాలో ఉత్తమ సొసైటీగా అవార్డును కైవసం చేసుకుంది. ఈ అవార్డును ఈనెల4న విజయవాడలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా సొసైటీ చైర్మన్ కేవీ సూర్యనారాయణ రాజు అందుకోనున్నారు.

పెరిగిన టర్నోవర్

కెల్ల సొసైటీ అధ్యక్షుడిగా కేవీ సూర్యనారాయణ రాజు(పులిరాజు) 1987లో బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో రూ. 87 వేలు వ్యాపారం ఉండేది. 2023 నాటికి రూ.22 కోట్లు 46 లక్షల టర్నోవర్ అయ్యేలా ఆయన అభివృద్ధి చేశారు. 1987 నుంచి నేటివరకు ఆయనే సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కెల్ల సొసైటీ ప్రస్తుతం సుమారు రూ.1.90 కోట్ల లాభంలో ఉంది.

గోదాముల నిర్మాణం

రైతులు వారి ఉత్పత్తులు నిల్వచేసుకునే అవకాశం లేక అయినకాడికి అమ్ముకుని నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వారు ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు సొసైటీ పరిధిలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో ఒకటి, రూ.40 లక్షలతో బెల్లాన పేట వద్ద మరో గోదాము నిర్మించారు. ప్రభుత్వం కొంత నిధులను మంజూరు చేస్తే వాటికి సొసైటీ పరిధిలోని నిధులను జోడించి గోదాముల నిర్మాణం పూర్తి చేశారు. అలాగే ఈ సొసైటీ ముందు ప్లాట్‌ఫాం నిర్మాణాలు చేపట్టి ఆవరణంలో మొక్కలు నాటి పర్యావరణం పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో లాభాల బాట

ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కెల్ల, తెట్టంగి, జమ్ముపేట, గుర్ల సొసైటీలలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల ఈ సొసైటీలు లాభాల బాటలో నడుస్తున్నాయి. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయడం, తగిన సమయంలో వారి ఖాతాకు ధాన్యం అమ్మిన నగదు అందించడం వల్ల రైతులు సొసైటీల ఆధ్వర్యంలో పంట అమ్మకానికి ఇష్టపడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వల్ల సొసైటీలు లాభాలబాట పట్టాయి

అందరి సహకారంతోనే సాధ్యం



రైతులను భాగస్వామ్యం చేయడం వల్ల సొసైటీ అభివృద్ధి చెందింది. జిల్లాలో ప్రథమ స్థానం సాధించడం చాలా సంతోషంగా ఉంది. రైతులకు అవసరమైన అన్ని సేవలను సొసైటీ దగ్గర అందిస్తున్నాం. 35 ఏళ్లుగా సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకుంటున్న రైతులకు రుణపడి ఉంటాను.

– కేవీ సూర్యనారాయణ రాజు, సొసైటీ అధ్యక్షుడు, కెల్ల

మల్టీ సర్వీసుల ప్రారంభానికి సన్నాహాలు

మండలంలోని కెల్ల సొసైటీలో మల్టీ సర్వీసుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. సొసైటీ అధ్వర్యంలో జనరిక్ మందుల షాపు, సీఎస్‌సీ కేంద్రాలు, సొసైటీ వద్ద ఎటీఎం సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. సొసైటీలో బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడంతో పాటు లాకర్ సదుపాయం కల్పించారు. .

రైతులకు డివిడెండ్‌ల పంపిణీ

కెల్ల సొసైటీలలో ప్రతి ఏడాది వచ్చిన లాభాల్లో రైతులకు డివిడెండ్‌లు కూడా పంపిణీ చేస్తారు. రైతుల అవసరం మేరకు రుణాలు మాత్రమే ఇచ్చే సొసైటీలు ఉన్నాయి. కాని ఈ సొసైటీని లాభాల బాటలో నడిపించడంలో రైతులను భాగస్వామ్యం చేస్తారు. ఈఏడాది 2095 మంది రైతులకు 6.78 లక్షలను డివిడెండ్ అందజేయనున్నారు.

మానవహక్కుల కమిషన్ వర్కింగ్ చైర్మన్ నియామకం


మానవ హక్కుల కమిషన్ వర్కింగ్ చైర్మన్‌గా నియమితులైన మల్లేశ్వరరావు

విజయనగరం: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వర్కింగ్ చైర్మన్‌గా వి.మల్లేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఇంటర్నేషనల్ మానవ హక్కుల అసోసియేషన్ నుంచి అందుకున్నట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతల మేరకు సమస్యలతో బాధపడుతున్న ప్రజల వేదనను అధికారులకు నివేదించి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. పాఠశాల విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఆడుదాం ఆంధ్రా లోగో రూపకల్పన

- క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు


క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వేంకటేశ్వర రావు

పార్వతీపురంటౌన్: ఆడుదాం ఆంధ్రా క్రీడల లోగో, మస్కట్‌లను రూపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడలు అక్టోబర్ 2వ తేదీన ప్రారంభమవుతాయని, ఈ క్రీడలు గ్రామ, వార్డు సచివాలయం, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 46 రోజుల పాటు జరుగుతాయని అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లతో పాటు యోగా, మారథాన్, పేరొందిన స్థానిక క్రీడలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు లోగో, మస్కట్ రూపొందించే పోటీల్లో పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయం విద్యార్థులతో పాటు, ఆంధ్ర ప్రదేశ్ పౌరులు ఎవరైనా పాల్గొన వచ్చని సూచించారు. మంచి ఆలోచనా విధానంతో చక్కటి సృజనాత్మకత కలిగిన లోగో, మస్కట్‌లు రూపొందించిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలుగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.

'లోగో మస్కట్ ఆన్‌లైన్ అప్‌లోడ్ ఇలా..

పోటీలు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ://స్పోర్ట్స్.ఏపీ.ఇన్ వెబ్ సైట్‌లో ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 7వ తేదీ సాయంత్రం పోటీలపై తుది నిర్ణయం ప్రకటిస్తారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలు, ఆరోగ్యం, దృఢత్వం ప్రోత్సహించడం, శీర్షికన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లోగో డిజైన్‌తో పాటు తెలుగులో ట్యాగ్ లైన్, మస్కట్‌కు ప్రత్యేకంగా సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు లోగో, మస్కట్‌లలో ఒకదానికి లేదా రెండు పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు క్రియేటివ్ కార్నర్ సెక్షన్ లేదా ఈ మెయిల్ ఐడీ ద్వారా ఎంట్రీలను సమర్పించవచ్చని చెప్పారు. ఎంట్రీల వివరాలను సంక్షిప్తంగా తెలియజేయాలని, విజేతగా నిలిచిన లోగో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ప్రభుత్వానికి చెందుతుందని పేర్కొన్నారు. లోగోలో ఎటువంటి అభ్యంతరకర సన్నివేశాలు, పదాలు ఉండరాదని స్పష్టం చేశారు. లోగో, మస్కట్‌ను సొంతంగా రూపొందించాలని, దేనికీ అనుకరణ ఉండరాదని, ఇండియన్ కాపీ రైట్ చట్టం, 1957కు లోబడి ఉండాలని వివరించారు. లోగో కలర్‌లో డిజైన్ చేయాలని, డిజిటల్ విధానంలో రూపొందించాలని, హై రిజల్యూషన్ (కనీసం 300 డీపీఐ)లో ఉండాలని, జేపీఈజీ లేదా పీఎన్‌జీ, లేదా పీడీఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని, వెబ్‌సైట్, సామాజిక మాధ్యమాలు, పేపర్లపై ముద్రణకు అనుగుణంగా ఉండాలని ఆయన వివరించారు. సృజనాత్మకత, వాస్తవికత (ఒరిజినాలిటీ), కూర్పు, సాంకేతిక ప్రతిభ, కళాత్మకత, కనిపించే విధానం తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక కమిటీదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు.

ఆర్టీసీలో యూటీఎస్‌పై అవగాహన


యూటీఎస్ విధానం ద్వారా ప్రయాణికులకు టికెట్లు అందజేస్తున్న కండక్టర్

విజయనగరం టౌన్: కాలానికనుగుణంగా ఏపీఎస్ఆర్టీసీ నగదు రహిత లావాదేవీలపై దృష్టిసారించింది. కరోనా నేపథ్యంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు యూనిఫైడ్ టికెటింగ్ సిస్టమ్ (యుటీఎస్) విధానాన్ని 2022లో ప్రవేశపెట్టింది. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి మొబైల్స్‌నుంచే నేరుగా టికెట్‌లు అందించేందుకు ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్‌లకు మంగళవారం అవగాహన నిర్వహించింది. జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనారాయణ, డిపో మేనేజరు శ్రీనివాసరావు,అసిస్టెంట్ మేనేజరు ఆదినారాయణ, రీజనల్ కోర్ గ్రూప్ సూర్యప్రకాష్‌లు డిపోలో ఉన్న అన్ని బస్సుల్లో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లకు యూటీఎస్ మెషీన్‌పై అవగాహన కల్పించారు. ప్రయాణికులకు ఈ టికెట్ అందించేలా చర్యలు చేపట్టారు.

విస్తృతంగా అవగాహన

ఆర్టీసీలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నాం. డ్రైవర్లు, కండక్టర్లకు ప్రతిరోజూ యూటీఎస్ విధానం ద్వారా ప్రయాణికులకు టికెట్లు ఇచ్చేవిధంగా తెలియజేస్తున్నాం. అన్ని రకాల యాప్‌ల ద్వారా టికెట్‌లు వచ్చేలా మెషీన్ రూపకల్పన చేశాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్. అప్పలనారాయణ, జిల్లా ప్రజారవాణాధికారి, విజయనగరం

పిచ్చికుక్క దాడిలో 13 మందికి గాయాలు

- బొండపల్లి పీహెచ్‌సీలో బాధితులను సందర్శించిన డీఎంహెచ్‌ఓ


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కుక్కకాటు బాధితులు

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లితో పాటు పంచాయతీలోని మధుర గ్రామమైన చందకపేటలో రెండు రోజులుగా పిచ్చికుక్క దాడి చేసి 13 మందిని గాయపరిచింది. వివరాలిలా ఉన్నాయి. దీంతో బాధితులు బొండపల్లి పీహెచ్‌సీలో చికిత్స నిమిత్తం చేరారు. బాధితుల్లో నెల్లిమర్ల మాణిక్యానికి తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స తరువాత గజపతినగరంలోని సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. గజపతినగరం సీహెచ్‌సీలో జి.అచ్చియ్యమ్మ, బి.జగన్నాథం, కె.త్రినాథ చికిత్స పొందుతుండగా బొండపల్లి పీహెచ్‌సీలో ఎ,అరుణ, కె.సత్యనారాయణ, జి.కామాక్షి, యు.నాగేశ్వర్రావు, టి.త్రినాథ, సీహెచ్.దేవుడమ్మ, ఎల్.రామలక్ష్మిలు చికిత్స పొందిన తర్వాత ఇంటికి వెళ్లి పోయారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ భాస్కర రావు బొండపల్లి పీహెచ్‌సీని తహసీల్దార్ డి.ప్రసాదరావు, ఎంపీడీఓ వైవీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి పరిశీలించి బాధితుల వివరాలతో పాటు వారికి అందించిన వైద్య సేవలపై వైద్యాధికారిణి ఆర్.అమృతవల్లిని అడిగి తెలుసుకున్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

పార్వతీపురం: వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన అంటిపేట లక్ష్మి పొలం పనుల కోసం వెళ్తుండగా వీరఘట్టం నుంచి పాలకొండ వెళ్తున్న ద్విచక్ర వాహనం వెనుకనుంచి ఢీకొట్టడంతో పలు చోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు చికిత్స కోసం వీరఘట్టం పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే వాహనం నడిపిన షాజహాన్‌కు కూడా పలు చోట్ల గాయాలు కావడంతో పార్వతీపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్‌కు..

మెంటాడ: మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సుంకరిరమణ జయితి గ్రామం నుంచి అమరాయవలస హరిత రహదారి ప్రాంతానికి వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్రగాయాల పాలవడంతో జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స నిమిత్త తరలించారు.

కత్తిపీట మీద పడి మరో వ్యక్తి..

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామానికి చెందిన వెల్లూరి ఎర్నాయుడు(32) మంగళవారం రాత్రి కత్తిపీట మీద పడడంతో మెడమీద తెగి తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయాలపాలైన వ్యక్తికి 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


చికిత్స పొందుతున్న లక్ష్మి, షాజహాన్

ఎంఈఓల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా మండల విద్యాశాఖాధికారుల సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఈఓల సంఘం జిల్లా నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా జె నారాయణ స్వామి, జిల్లా అధ్యక్షుడిగా సామల సింహాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్ నాగభూషణ రావు, ట్రెజరర్‌గా ముప్పల వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కర్రి ప్రసాదరావు, ఎం.శ్రీనివాసరావు, ఆర్.ఆనంద రావు, పి.జోగారావు, కె.సోంబాబు, పి.సత్యనారాయణ మహిళా ప్రతినిధులుగా వై.విమల కుమారి, సూరిదేముడు ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా బి.చంద్రశేఖర్, ఎ.శ్రీనివాసరావు తదితరులు ఎన్నికయ్యారు.

బంగారం చోరీ

గజపతినగరం: మండల కేంద్రంలో పాతమండల పరిషత్ కార్యాలయం రోడ్‌లో నివాసం ఉంటున్న ఇమంది రమణమ్మ ఇంట్లో మంగళవారం వేకువజామున బంగారం చోరీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త చనిపోయాడని, ఇద్దరు కుమారులు ఆర్మీలో పని చేస్తున్నారని ఒక్కదాన్నే ఉండడం చూసి దొంగతనానికి దుండగులు పాల్పడినట్లు కన్నీటి పర్యంతమైంది. సోమవారం రాత్రి ఒంటరిగా ఉన్నందున పక్కనే తెలిసిన వారి ఇంట్లో నిద్రించేందుకు వెళ్లానని మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని వాపోయింది. తులం బంగారం చోరీ జరగడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపింది.

వీడిన హత్య కేసు మిస్టరీ

- నిందితుడి అరెస్ట్
- సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నిందితుడు జనసేన నాయకుడు


హత్య కేసు వివరాలు చెబుతున్న డీఎస్పీ గోవిందరావు

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణాన్ని మూడు రోజుల కిందట ఉలిక్కి పడేలా చేసిన స్థానిక చందన్ లాడ్జిలో మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ కేసుకు సంబంధించి మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు వివరాలు వెల్లడించారు. ఈనెల 30వ తేదీన ఎస్.కోటలోని చందన్ లాడ్జి మేనేజర్ గనివాడ శ్రీనివాసరావు లాడ్జిలో ఒక మహిళ మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్య కేసుగా నమోదు చేశాం. ఘటనాస్థలిని పరిశీలించి రూమ్ నంబర్ 103లో మహిళ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం పంపించాం. తర్వాత విచారణలో మృతురాలు విశాఖ జిల్లా దేవరాపల్లి గ్రామానికి చెందిన ఆరిపాక ఈశ్వరమ్మగా గుర్తించాం. గత నెల 24న అరకు మండలం ఉరుముల గ్రామానికి చెందిన మాదాల శ్రీరాములు (జనసేన నాయకుడు) చందన్ లాడ్జిలో రూమ్ బుక్ చేశాడు. ఆ వ్యక్తే హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడు మాదాల శ్రీరాములును మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అరెస్టు చేశాం. ఈశ్వరమ్మను ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం హత్య చేసినట్లు నిందితుడు శ్రీరాములు విచారణలో అంగీకరించాడని డీఎస్పీ తెలిపారు.


పవన్‌కళ్యాణ్‌తో నిందితుడు శ్రీరాములు (ఫైల్)

డబ్బుల కోసం గొడవపడి..

మృతురాలు ఈశ్వరమ్మ తనకు తెలుసని, ఆమెను లాడ్జికి తానే తీసుకెళ్లానని, తర్వాత డబ్బుల కోసం గొడవ పడ్డామని, ఆ గొడవలో తాను ఆమెను గోడకు గుద్దేయడంతో తలకు గాయమై పడిపోగా తర్వాత మెడకు చీర బిగించి హత్యచేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో తెలిపాడు. మరుసటి రోజు లాడ్జికి వచ్చి మృతురాలి వంటిపై ఉన్న 4బంగారు గాజులు, దుద్దులు, ఉంగరం తీసుకుని, ముత్తూట్ ఫిన్ కార్పొరేషన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టినట్లు చెప్పాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ముత్తూట్ బ్యాంక్ నుంచి 60 గ్రాముల బంగారం, నిందితుడి నుంచి రెండు మొబైల్స్, పల్సర్ బైక్, లక్ష రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ గోవిందరావు వివరించారు. హత్య కేసును ఛేదించిన సీఐలు, ఎస్సై ఇతర సిబ్బందిని డీఎస్పీ గోవిందరావు అభినందించారు.

అర్హులందరికీ ఆసరా అందేలా చూడాలి

- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ అప్పలరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: అర్హులైన వారందరికీ ఆరోగ్య ఆసరా అందేలా చూడాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తిరుమల మెడికల్ ఆస్పత్రిలో ఆరోగ్య మిత్రలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు టిఫాస్కాన్, అల్ట్రాసౌండ్ స్కాన్ చేయాలని సూచించారు. నిర్దేశిత సమయానికి ఎఫ్ఆర్ఎస్ అందరూ వేయాలని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందే రోగులకు అన్ని సేవలు ఉచితంగా అందించాలని కోరారు. ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య ఆసరా కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆరోగ్యశ్రీ రోగులకు అందించే భోజనం నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో టీమ్ లీడర్లు రాయవరపు ముత్యాల నాయుడు, ఎ. భానుప్రసాద్, బి.ఉమ, పి.దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్య ఎచీవర్స్ డే వేడుకలు



రూ.13 లక్షల ప్యాకేజీ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎస్పీ దీపిక

విజయనగరం అర్బన్: సాధారణ డిగ్రీ పూర్తి చేసి రూ.లక్షల ప్యాకేజీ సాధించడంలో విద్యార్థి ప్రతిభ, క్రమశిక్షణతో కూడిన కళాశాల బోధన సహకరిస్తాయని ఆ దిశగా ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యాసేలను అందిస్తోందని మాజీ డాక్టర్ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి కొనియాడారు. పట్టణానికి చెందిన ఆదిత్య డిగ్రీ కళాశాల స్థానిక ప్రదీప్‌నగర్‌లో ఒక ప్రైవేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన 'ఎచీవర్స్ డే -2023' కార్యక్రమానికి ఆమె విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతోపాటు విద్యార్థుల్లోని స్కిల్స్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ దీపిక మాట్లాడుతూ విజయనగరానికి చెందిన ఆదిత్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి అధిక సంఖ్యలో ఉద్యోగాలు సాధించడం ప్రసంశనీయమన్నారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య విద్యాసంస్థలో చదివిన ప్రతి విద్యార్థికీ డిగ్రీ పూర్తయి వెళ్లేముందు ఒక చేతిలో డిగ్రీ పట్టా మరో చేతిలో ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగం అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం గడిచిన సంవత్సరంలో ఉద్యోగాలు సాధించిన 483 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఎస్పీ దీపికను విద్యాసంస్థ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీవీగోపాల రాజు, కళాశాల ప్రిన్సిపాల్ బి.దామోదర రావు, విజయనగరం డైరెక్టర్ పి.రామకృష్ణారెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.